క్లుప్తంగా

ప్రీతినాయక్‌కు న్యాయం జరిగేదాకా పోరాటం: బీజేపీ

సైదాబాద్: తెలంగాణలో మహిళలపై కొనసాగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన నిరసన దీక్షకు మలక్‌పేట నుంచి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సోమవారం బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయానికి మలక్‌పేట నియోజకవర్గం నుంచి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ నాయకులతో కలిసి వెళ్లి బండి సంజయ్‌కు మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. అనంతరం ఆయన సైదాబాద్‌లో ఆయన మాట్లాడుతూ... గిరిజన బిడ్డ ప్రీతినాయక్‌కు న్యాయం చేయం వరకు పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.

చిట్టీల పేరుతో టోకరా

చంచల్‌గూడ: కుల సంఘం పేరుతో చిట్టీలు నిర్వహించి నిర్వాహకులు చేతులు ఎత్తేసిన సంఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... కుర్మగూడ డివిజన్ మాదన్నపేటకు చెందిన సెంట్రింగ్ కూలీ సతీష్ మాదన్నపేటలోని రెడ్డి సంఘంలో రూ. లక్ష చిట్టీ వేశాడు. 17 నెలల పాటు చిట్టీ డబ్బు కట్టాడు. చిట్టీ ఎత్తగా డబ్బులు ఇవ్వకుండా దాటవేస్తున్నారని, పొంతన లేదని సమాధానాలు ఇస్తున్నారని సోమవారం మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిట్టీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ జానయ్య తెలిపారు. చిట్టీల నిర్వాహకులు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారే లేదా అనే అంశంపై కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంకా చాలా మంది బాధితులు పోలీసులను ఆశ్రయించే అవకాశమున్నట్లు తెలుస్తుంది.

చిన్నారి పట్ల అసభ్యకర ప్రవర్తన: వృద్ధుడి అరెస్ట్

చైతన్యపురి: ఓ చిన్నారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వృద్ధుడిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ సమాచారం మేరకు... చైతన్యపురి పరిధిలోని ఓ కాలనీలో వెంకట్‌రావ్(81) అనే వృద్ధుడు ఇంటి సమీపంలోని ఓ ఎనిమిది సంవత్సరాల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికుడు బాలిక కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రజల ఆకాంక్షలను ఉపాధ్యాయులు నెరవేర్చాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



సైదాబాద్: రాష్ట్రంలో కొనసాగుతన్న నియంతృత్వ పాలనను తరిమికొట్టాలన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కోరారు. సోమవారం రాత్రి చంపాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బండి సంజయ్ మాట్లాడుతూ... నిజాయితీ, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ కించపరిచేలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు నెల నెల సక్రమంగా జీతాలు కూడా ఇవ్వలేని ప్రభుత్వానికి ఉపాధ్యాయులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, డీఏ, ప్రమోషన్‌లు ఇవ్వటంలో ప్రభుత్వం కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించారు. జీఓ 317 సవరించాలని ఆందోళనకు దిగిన ఉపాధ్యాయులను వారి పిల్లల ముందే పోలీసులతో విచక్షణారహితంగా కొట్టించిటం అమానవీయమన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎ.వి.ఎన్.రెడ్డిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీలు రామచంద్రారావు, మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నర్సింహారెడ్డి, మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'వీడియో పోస్టు చేశాడని చితకబాదాడు'

మీర్‌పేట: తరగతి గదిలో తీసిన వీడియోను కళాశాల గ్రూపులో పోస్టు చేసినందుకు గాను ఓ విద్యార్థిని హెచ్‌ఓడీ చితకబాదాడు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన బుగ్గ ప్రదీప్‌కుమార్ కుమారుడు దాక్షిణ్యదీప్ (17) టీకేఆర్ కళాశాలలో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వారం రోజుల క్రితం హెచ్‌ఓడీ మహేష్ తరగతి గదిలో ఓ విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన దృశ్యాలను దాక్షిణ్యదీప్ 'పాలిటెక్నిక్ ఫ్రెండ్స్ వాట్సాప్ గ్రూప్'లో శనివారం పోస్టు చేయగా వీడియో కాస్తా వైరల్ అయింది. విషయం తెలుసుకున్న హెచ్‌ఓడీ మహేష్ అదే రోజు సాయంత్రం దాక్షిణ్యదీప్‌పై దాడి చేశాడు. దీంతో పాటు సోమవారం కూడా హెచ్‌ఓడీ మహేష్ మళ్లీ విద్యార్థిపై దాడి చేసి చంపేస్తానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన దాక్షిణ్యదీప్ ఈ విషయాన్ని తండ్రికి చెప్పి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో.. కంగారు పడ్డ తండ్రి వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాడు. ఈ సంఘటనపై ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి

వైభవంగా మహామృత్యుంజయ హోమం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- హాజరైన ప్రముఖులు, భక్తులు

హస్తినాపురం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ బైరామల్‌గూడ డిఫెన్స్ కాలనీలోని శ్రీ హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ముగింపు రోజున కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొని శివలింగానికి అభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహా మృత్యుంజయ పాశుపత హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం శివునికి అభిషేకం చేసి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు పూర్ణాహుతితో పూజలు చేశారు. కార్యక్రమంలో గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల జాతీయ సభ్యులు పేరాల శేఖర్‌జీ, సామ రంగారెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ఆలయ కమిటీ డైరక్టర్లు సందీప్‌రెడ్డి, లంకల రమేశ్‌రెడ్డి, మిర్యాల అంజయ్యగుప్తా, మల్లికార్జున్, సుంకరి రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. –హస్తినాపురం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు అవగాహన

మలక్‌పేట: మూసారంబాగ్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో సోమవారం మలక్‌పేట జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీం వారు వరదలు, అగ్ని ప్రమాదాలు, చెట్లు కూలిపోయేటప్పుడు, భూకంపాల సంభవించినప్పుడు తదితర ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా సందర్భాలలో పరికరాలతో తమను తాము ఎలా కాపాడుకోవాలో వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను సిబ్బంది నివృత్తి చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ భువనేశ్వరి, ఎస్‌ఎఫ్ఓ సుధాకర్, మేనేజర్ మనోహర్, సిబ్బంది లింగస్వామి, జనార్థన్, సుమన్, జగన్ పాల్గొన్నారు.

కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో...

నాగోలు: వివిధ విపత్తుల వేళ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) మేనేజన్ కాశీం సూచించారు. సోమవారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విపత్తులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...



అవగాహన కల్పిస్తున్న టీం సభ్యులు

విపత్తుల సమయంలో వెంటనే డీఆర్‌ఎఫ్‌కు 9000113667 టోల్ ఫ్రీ నెం ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. విపత్తు చోటు చేసుకున్న ప్రాంతానికి చేరకున్న డీఆర్‌ఎఫ్ బృందం అవసరాన్ని బట్టి ఫైర్ బాల్స్ మంటలను ఆర్పేసే పరికాలను ఉపయోగిస్తూ ప్రజలను కాపాడతారన్నారు. విపత్తుల వేళ వారు ఉపయోగించే పరికరాలనూ ప్రదర్శించారు. డీఆర్‌ఎఫ్ సిబ్బంది రాజు, గణేష్, ప్రవీణ్, శ్రీశైలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

చంచల్‌గూడ: మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో ప్రజల నుంచి సెల్‌ఫోన్‌లను దొంగలిస్తున్న ఇద్దరిని మాదన్నపేట పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించారు. డీఎస్ఐ వెంటక్‌రెడ్డి సమాచారం మేరకు... కుర్మగూడ డివిజన్ మాదన్నపేట మార్కెట్‌లో కూరగాయల కొనుగోలు చేస్తున్న వారిని నుంచి సెల్‌ఫోన్‌లు తస్కరిస్తున్న రాజమండ్రికి చెందిన అంబటి శివ(23), మేకల సిద్దు(19)లను అరెస్టు చేశారు. వీరు ప్రస్తుతం భూపేష్‌గుప్తానగర్‌లో నివాసముంటున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రెండు స్మార్ట్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అష్టలక్ష్మి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లో ప్రసిద్ధిగాంచిన వాసవి కాలనీ అష్టలక్ష్మీ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం అష్టలక్ష్మీ దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్ర శేఖర్ గుప్తా సమక్షంలో సోమవారం అష్టలక్ష్మి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, అక్షయ ట్రస్ట్ సెక్రటరీ మద్యాల సుధాకర్ గుప్తా, మాజీ చైర్మన్ దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అష్టలక్ష్మి ఆలయానికి మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. దేశంలో ప్రసిద్ధి ఆలయంగా తీర్చిదిద్దాలని కోరారు. దేవాలయ చైర్మన్ సోమా సురేష్, కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య గుప్తా, వైస్ చైర్మన్ నగమల్ల శ్రావణ్, సెక్రటరీలు వనం యాదయ్య, దాచేపల్లి శ్రీనివాస్, పొద్దుటూరి నరసింహారావు, ప్రత్యేక ఆహ్వానితులుగా చిలుక ఉపేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఉమాపతి రావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా

అనాథ విద్యార్థులకు చేయూత



రేషన్ అందజేస్తున్న రఘుకుమార్, విజయలక్ష్మి దంపతులు

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్‌కు చెందిన రఘుకుమార్ ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 40 వేల విలువైన రేషన్ సరుకులను గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ సమక్షంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్ మాట్లాడుతూ... అమెరికాలో ఉన్న వారి కుమారుడు జగదీశ్వర్ సాయికృష్ణ కోడలు నిఖితల పెళ్లి రోజు సందర్భంగా రేషన్‌ను అందజేశామన్నారు. గడచిన ఐదేళ్లుగా రఘుకుమార్‌- విజయలక్ష్మి దంపతులు కొడుకు, కోడలు జగదీశ్వర సాయికృష్ణ-నిఖితల పెళ్లి రోజు వేడుకలు అనాథ విద్యార్థి గృహంలో జరుపుతూ రూ. 40 వేల రేషన్‌ను అందజేస్తున్నారని, అందుకు రఘుకుమార్ దంపతులకు అధ్యక్షుడు మార్గం రాజేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సాయినగర్‌లోని సమస్యలకు చెక్ పెడతాం

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల



సాయినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, అధికారులు

మలక్‌పేట: సాయినగర్ పరిధిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. సోమవారం అధికారులతో కలిసి మూసారంబాగ్ డివిజన్ సాయినగర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీలో తిరిగి డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్, రోడ్, నాలా, సమస్యలు పరిశీలించారు. పోచమ్మ టెంపుల్ కుడి వైపు నుంచి మూసారంబాగ్ నాలావైపు రోడ్డు నిర్మాణం వలన తలెత్తిన సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. టెంపుల్ ఎదురుగా ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డుకు సమాంతరంగా నాలావైపు రోడ్డు నిర్మిస్తే వరదనీరు ఇండ్లలోకి వచ్చి చేరుతుందని ఎమ్మెల్యేకు చెప్పారు. కాలనీవాసులకు ఎవరికీ ఇబ్బంది తలెత్తకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మ్యాన్‌హోల్స్, డ్రైనేజీ సమస్యలు పట్టించుకోవడంలో జలమండలి అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా పనితీరు మెరుగుపరుచుకోవాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పనులకు ప్రతిపాదనలు తయారు చేసి, వీలైనంత మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. డీఈఈ ప్రదీప్‌కుమార్, జలమండలి డీజీఎం షీలారాణి, ఏరియా మేనేజర్ చంద్రునాయక్, విద్యుత్ శాఖ ఏఈ ప్రీతి, మాజీ కార్పొరేటర్ ఎం.డి. అస్లాం, జయప్రకాశ్‌రెడ్డి, ఇలియాస్, బాబా, కార్తీక్ రెడ్డి, సృజన, నరేష్, రజాక్, అమిత్, దౌలత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'వ్యక్తిగత దూషణలకు పాల్పడితే సహించం'

- కాంగ్రెస్ నాయకులను గల్లీల్లో తిరగనీయం
- బీఆర్‌ఎస్ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ నేతలు అనుచిత, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే సహించమని.. వారిని గల్లీల్లో తిరగకుండా చేస్తామని బీఆర్‌ఎస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ నాయకులు హెచ్చరించారు. సోమవారం మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గం, డివిజన్ అభివృద్ధిని కాంక్షిస్తే చర్చకు రావాలి లేదా అభివృద్ధిపై ప్రశ్నించాలి తప్ప వ్యక్తి జీవితంపై ఆరోపణాలు చేసి ఉనికిని చాటుకోవలనుకోవడం మంచిది కాదని హితవు పలికారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేను రాజకీయకంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు సామాజిక మధ్యమాల వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు. ప్రతి పార్టీకి కార్యకర్తలు ఎంతో ముఖ్యమని వారిని కాంగ్రెస్ నాయకులు కుక్కలతో పోల్చడం సిగ్గుచేటని, కార్యకర్తలు లేనిదే ఏ పార్టీ లేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇకనైనా మారాలని, ప్రజల కోసం అభివృద్ధిపై ప్రశ్నిస్తే చర్చలకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు ఇరిగే రమేష్, జగదీష్‌గౌడ్, ఎరుపుల యాదయ్య, దుర్గరావు, రవి, శివశంకర్, సాయిగౌడ్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే ఎస్‌ఎన్‌డీపీ పనులు పూర్తి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎస్‌డీపీ పనులు 60 శాతం పూర్తి అయ్యాయని మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఎన్‌డీపీ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... మే లోపు ఎస్‌ఎన్‌డీపీ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే బండగూడ నుంచి నాగోలు వరకు, బాతుల చెరువు నుంచి ఇంజాపూర్ నాలా వరకు పూర్తి స్థాయిలో పనులు చేశామన్నారు. వంగ శంకరమ్మ, చంద్ర గార్డెన్ నుంచి సరూర్‌నగర్ చెరువు వరకు, సరూర్‌నగర్ చెరువు నుంచి చైతన్యపురి వరకు చేస్తున్న పనులలో వేగం తగ్గడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులలో అతసత్వం తగదని ఎలాంటి పరిస్థితిలో మే నాటికి పనులు పూర్తి చేసి తీరలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ చీఫ్ ఇంజనీర్ కిషన్, ఈఈ కృష్ణరావు, డీఈలు కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎన్‌డీపీ పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దరఖాస్తుల పరిశీలిన పూర్తి..
ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ నగర్ డివిజన్ వైదేహీనగర్ నార్త్‌లో 118 జీఓ కింద దరఖాస్తుల పరిశీలన పూర్తయిన సందర్భంగా సోమవారం బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాలనీలో పలు సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలోని ప్రతి సమస్యను పరిష్కరించడంతో ఇప్పటికే సీఎం ఇచ్చిన సిఫారసు లేఖను సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌ను కలసి అందజేశామని, త్వరలో వారితో చర్చించి పూర్తి వివరాలను తెలియాజేస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పోగుల రాంబాబు పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ



విచారణ చేస్తున్న పోలీసులు

హయత్‌నగర్: ఓ హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన సోమవారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు... అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం పస్మాముల సాయిరెడ్డి కాలనీలో నివసించే బాతుల శివనారాయణ నగరంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని చూసేందుకు ఈ నెల 3న ప్రకాశం జిల్లాలోని తన సొంతూరు పూసూరుకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి వెళ్లారు. సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని 5.6 గ్రాముల రెండు బంగారు చైన్లు, రూ. 37 వేలు కనిపించలేదు. దీంతో శివనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గంజాయి సేవించే వారిపై చర్యలు తీసుకోవాలి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ న్యూమారుతీనగర్ కాలనీ ఆనుకుని ఉన్న మూసీ నది పరీవాహక ప్రాంతంలో గంజాయి సేవిస్తూ స్థానికంగా ఇబ్బందులు కల్గిస్తున్న వారిపై చర్యలు తీసుకావాలని కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా పోలీసు సిబ్బందిని కోరారు. న్యూమారుతీనగర్ సౌత్ కాలనీలో సోమవారం రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించేందుకు వెళ్లిన కార్పొరేటర్‌కు కొందరు గంజాయి సేవిస్తున్న విషయంపై ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చైతన్యపురి పోలీసులను పిలిపించారు. గంజాయి సేవించే వారిని పట్టుకోవాలని సూచించారు. స్థానిక నేతలు ఉపేందర్, శివకుమార్, అంజిబాబు, ఆనంద్, జగదీష్, రవికుమార్, కమల్, చలపతిరావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యను పోలీసులకు వివరిస్తున్న కార్పొరేటర్ నర్సింహ గుప్తా

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



కంటి వెలుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. చైతన్యనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... కంటి పరీక్షలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కాలనీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు ముదుపు సందీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలు

- ఫుడ్ డెలివరీ బాయ్ అరెస్టు
- రూ. 7 లక్షల సొత్తు స్వాధీనం

నాగోలు: విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి సులువుగా డబ్బు సంపాదించడం కోసం రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఫుడ్ డెలివరీ సర్వీస్ చేస్తున్న పాత నేరస్తుడిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తలరించారు. అతడి నుంచి రూ. 7 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో డీసీపీ సాయిశ్రీ వెల్లడించారు. ఇంజాపూర్ చెందిన ఎస్లావత్ సాయికుమార్ నాయక్(23) నగరంలో జొమాటోలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. వచ్చే డబ్బులు సరిపోక పోవడం... విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాలని భావించాడు. సులువుగా డబ్బు సంపాధించేందుకు బంగారం గొలుసులు స్నాచింగ్‌లు, తాళం వేసి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేయడం, పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీలకు చేస్తున్నాడు. ఈ క్రమంలో 2021లో సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ కేసులో జైలు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి వచ్చిన తరువాత కొన్ని నెలల పాటు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో మాస్టర్ చెఫ్‌గా పనిచేశాడు. అక్కడ వచ్చే డబ్బులు సరిపోక పోవడంతో రాత్రి సమయంలో కాలనీలు తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తనతో పాటు తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలను చోరీలకు పాల్పడతాడు. దొంగతనం చేసిన తర్వాత స్నేహితుల సహకారంతో బంగారు ఆభరణాలను విక్రయించేవాడు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి ఓఎల్‌ఎక్స్‌లో ద్వారా అమ్మేవాడు. ఈ క్రమంలో ఎల్‌బీనగర్ ఏఎస్ఐ ప్రభులింగంతో పాటు క్రైమ్ సిబ్బంది ఎల్‌బీనగర్ డీవీఎం కళాశాల వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై అనుమానాస్పద స్థితిలో ఉన్న సాయికుమార్ నాయక్ పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. వెంటనే అక్కడ పోలీసులు అతనిని వెంబడించి పట్టుకున్నారు. విచారణ చేయగా ఎల్‌బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లతో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు అంగీకరించాడు. ఈ క్రమంలో అతడి నుంచి 85 గ్రాములు బంగారం, 150 గ్రాములు వెండి ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ఎస్ఐ నరేందర్ పాల్గొన్నారు.



పోలీసులు అరెస్టు చేసిన సాయికుమార్‌నాయక్

జీహెచ్‌ఎంసీ ఉద్యోగిని దుర్భాషలాడిన వ్యక్తి అరెస్ట్

చైతన్యపురి: జీహెచ్‌ఎంసీ ఉద్యోగిని ఫోన్‌లో దుర్భాషలాడిన ఓ వక్తిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... సత్యనారాయణ అనే జీహెచ్‌ఎంసీ బిల్ కలెక్టర్ ఆస్తిపన్ను వసూలు కోసం మార్గదర్శి కాలనీలోని ఓ వాషింగ్ సెంటర్‌కు వెళ్లారు. రెసిడెన్షియల్ టాక్స్ బదులు కమర్షియల్ ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని అక్కడ వాషింగ్ సెంటర్‌కు చెందిన మహిళతో చెప్పారు. దీంతో ఆమె నోటీసు ఇచ్చి వెళ్లండి అని చెప్పింది. ఇదే విషయాన్ని ఫోన్‌లో ఆ మహిళ తనకు తెలిసిన సోమిరెడ్డికి చెప్పింది. దీంతో సోమిరెడ్డి బిల్ కలెక్టర్ సత్యనారాయణకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. దీనిపై యూనియన్ నాయకులతో వెళ్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళలు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధచూపాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్‌బీనగర్ కాకతీయ కాలనీలోని కాకతీయ పాఠశాలలో సోమవారం మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో మహిళలకు ఉచితం షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ పాఠశాల డైరెక్టర్ ఉమ మహేశ్వరి మాట్లాడుతూ... మహిళలు ఇంటితో పాటు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకునే అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుచరిత తదితరులు పాల్గొన్నారు.